

# ఇంతకీ నేనేం చెప్పాలి?

చీటికీ మాటికీ అబద్ధాలాడటం నేర్చుకున్నాడని ఆరేళ్ళ నానిని రాధ చితకబాదింది ''ఇంకెప్పుడూ అబద్ధాలాడవుకదా..'' అంటూ.

''పోన్లెద్దూ, వాడినలా కొట్టేసినంతమాత్రాన వాడికేం బుద్ధి వచ్చేయదు. నయానా భయానా లేక బుజ్జగించి చెప్పాలి. అంతేకాని కొడితే అర్థం చేసుకుని తప్పుదిద్దుకోగల వయసా వాడిది?'' అంటూ భార్యని కేకలేసి, నానిని చేరదీసి ''ఇంకెప్పుడూ ఏ విషయంలోనూ అబద్ధాలాడకేం. అప్పుడు అమ్మ మళ్ళీ యిలాగే కొట్టేస్తుంది. పైగా అబద్ధాలాడితే కళ్ళు పోతాయి. దేవుడికి కోపం వచ్చి నాలిక కోసేస్తాడు ఆఁ..'' అని నచ్చచెప్పి బజ్జోపెట్టాడు రాజారావు.

''రాజారావు గారూ... రాజారావుగారూ'' బయట నిలబడి కేకలేసాడు గోవిందయ్య.

ఆ గొంతు విని రాజారావు లోపలి గదిలో దాక్కుని ''లేనని చెప్పు. ఊరెళ్ళారు ఇప్పుడప్పుడే రారని చెప్పు'' అన్నాడు భార్యతో.

''అలాగే! అయినా వీడు ఇప్పుడు దాపురించాడేమిటి?'' అని విసుక్కుంటూ గబగబా బయటకి వచ్చి, ''ఆయన లేరండీ, క్యాంపు కెళ్ళారు. వచ్చిన వెంటనే మీ దగ్గరకు పంపిస్తాను'' అంది రాధ.

తల్లి వెనకే కొంగుపట్టుకు నిల్చున్న నాని ''మా నాన్నారు ఉన్నారు. మీరు వచ్చారని కంగారుగా లోపల గదిలో దాక్కున్నారు. పాపం మీరంటే భయం కాబోలు. మీరు కొట్టను, తిట్టను అంటే బయటకి వస్తారు. సరేనా?'' అంటూ గబగబా వాగేసాడు.

గోవిందయ్య నిర్ఘాంతపోయి ''అదేవిటమ్మా ఇంట్లో ఉంచుకుని లేరని చెప్తావా? పిలు బయటకి'' అంటూ అరిచాడు కోపంగా.

అప్పటికే సంభాషణ అంతా లోపల్నుంచి విన్న రాజారావు, నానీని తిట్టుకుంటూ బయటకు వచ్చి ''ఆఁ ఎంతోసేపయిందండీ గోవిందయ్యగారూ మీరు వచ్చి? రండి లోపలకి''

జి. రామలక్ష్మి, హైదరాబాదు

అన్నాడు ఏమీ ఎరగనట్లు.

"చాల్చాల్లేవయ్యా మహా పెద్ద మనిషివి బయలుదేరావు. ఇంట్లోనే వుండి భార్య చేత క్యాంపుకెళ్ళానని చెప్పించావు. మీ పిల్లవాడు చెప్పాడు కాబట్టి సరిపోయింది. లేకుంటే నీ యింటి చుట్టూ పదిసార్లు తిరగాల్సిందేకదా! అయినా నా బాకీ వడ్డీతోసహా తీర్చిపారేస్తే మళ్ళీ నీ యింటి గుమ్మం ఎక్కుతానా ఏం? నీలాంటి వాడికి అప్పులివ్వడం అసలు నాదే బుద్ధి తక్కువ.నా పైసలందినాక నీ గుమ్మం తొక్కినా, మళ్ళీ నీకు అప్పు యిచ్చినా నీ కాలి చెప్పుతోనే నన్ను కొట్టు" అంటూ దుమ్మెత్తిపోసాడు గోవిందయ్య.

గోవిందయ్య తిట్లకి రాధా, రాజారావుల ముఖాలు వాలిపోయాయి అవమానంతో. ఎలాగోలా రాజారావ్ ఓ రెండు మూడు రోజుల్లో పూర్తి అప్పు తీర్చేస్తానని నచ్చచెప్పి, బ్రతిమిలాడి పంపేశాడు గోవిందయ్యని.

ఆ తర్వాత ఇద్దరూ కోపంతో నానిని "మా పరువు తీసి మమ్మల్ని తిట్టిస్తావా? నీవల్ల మేము తలవాచేట్లు తిట్లు తిన్నాము" అంటూ చెరో దెబ్బ కొట్టారు.

నానీ ఆరున్నొక్క రాగం సునాయాసంగా తీసి ఆ తర్వాత- "మీరేగా యింకెప్పుడూ అబద్ధాలాడకు, దేవుడు నాలిక కోసేస్తాడు, కళ్ళు పోతాయి అన్నారు. అందుకే అమ్మ పాపం తెలియక అబద్ధమాడితే కళ్ళు పోయి, నాలుకపోయి గుడ్డిగా, మూగగా బ్రతకాలని, అమ్మపై జాలేసి నిజం చెప్పాను. నేను అబద్ధం చెప్పినా మీరు కొడుతున్నారు. నిజం చెప్పినా కొడుతున్నారు. ఇంతకీ నేనేం చెప్పాలి?" అంటూ మళ్ళీ రాగం తీసాడు.

"అవునుకదా వాడన్నదీ నిజమే! నిజం చెప్పినా తప్పే, అబద్ధం చెప్పినా తప్పే. మరి పెద్దలయితే సమయస్ఫూర్తిగా ప్రవర్తిస్తారు. కానీ పిల్లలకది చేతకాదే! కల్లాకపటం ఎరగని పిల్లలు ఏదిచేసినా ఏది చెప్పినా పెద్దలు తమ పెద్దరికంతో వారిని చావబాదుతుంటే మరి పిల్లలు ఏం చేయాలి? ఏం చెప్పాలి?" అని ఇద్దరూ ఒకే రకమైన ఆలోచనలో పడ్డారు.

